www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 12 ఆగస్టు 2023

5

కోనసీమ

పెట్రోల్ బంకుల్లో ఎంఎస్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి-మండపేట

పట్టణ, మండలంలోని తాపేశ్వరం గ్రామ తదితర ప్రాంతాల్లోని ఆరు పెట్రోల్ బంకుల ను ఎంఎస్‌ఒ సుబ్బరాజు శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల'ప్రజాశక్తి'లో పెట్రోల్ బంకుల్లో కానరాని సౌకర్యాలు, పనిచేయని గాలి పెట్టే యంత్రాలు అని ప్రచురించిన కథనాలకు స్పందించిన అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. పెట్రోల్ బంకుల లైసెన్స్, ఫైర్ సేఫ్టీ విధానం, స్టాక్ బోర్డు, ధరల పట్టిక, పిఒఎస్ యంత్రాలు, పెట్రోలు, డీజిల్ నాణ్యత తదితర వాటిని పరిశీలించారు. ఎంఎస్‌ఒ సుబ్బరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టామని నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పెట్రోల్ కొలతను పరిశీలిస్తున్న సుబ్బరాజు

మహిళల ఆర్థిక పరిపుష్టికి కృషి

- 4వ విడత రూ.1353.76 సున్నా వడ్డీ జమ
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమలాపురం, అమలాపురం రూరల్

స్వయం సహాయక సంఘాలు బ్యాంకు లింకేజీ ద్వారా పొందిన రుణాలను ఆదాయ వనరులు ఒనగూరే రంగాల్లో పెట్టుబడిగా పెట్టి పేదరికాన్ని జయించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అమలాపురం బాలయోగి స్టేడియంలో 4వ విడత వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పథకం కింద రూ.1,353.76 కోట్లను బటన్ నొక్కి సిఎం జగన్ బ్యాంకు ఖాతాలకు జమేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అక్క చెలెమ్మల ముఖాల్లో చిరునవ్వులు, జీవితాల్లో వెలుగులు నింపేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలను ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. గతంలో రుణమాఫీ చేస్తామని చంద్రబాబు మాట ఇచ్చి మహిళలను మోసం చేశారన్నారు. బాబు హయాంలో రూ.14వేల కోట్లకుపైగా బకాయిలు పెట్టారన్నారు. వాటిని తమ ప్రభుత్వమే చెల్లించిందన్నారు. మహిళలను మోసం చేసిన చరిత్ర నారా వారిదే అని విమర్శించారు. 2016లో సున్న వడ్డీ పథకాన్ని చంద్రబాబు రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు చేసిన పనివల్ల ఎ, బి గ్రేడ్‌ల్లో ఉండే సంఘాలన్నా సి, డి గ్రేడ్‌లకు దిగజారాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, జోగి రమేష్, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చింతా అనురాధ, పిల్లి సుభాష్ చంద్రబోస్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంఎల్‌ఎలు పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, రాపాక వరప్రసా దరావు, కొండేటి చిట్టిబాబు, చిర్ల జగ్గిరెడ్డి, కురసాల కన్నబాబు, ఎంఎల్‌సిలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్ర బాబు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యానాగేంద్రమణి, జడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరి, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, జడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పినిపే విశ్వరూప్

చంద్రబాబే కార్యకర్తల్ని రెచ్చగొట్టారు

పుంగనూరు ఘటనలో చంద్రబాబే కార్యక్రర్తలను రెచ్చగొట్టారన్నారు. పుంగనూరులో అనుమతి లేని రూట్లో వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. ఆ రూట్లో వెళ్లొద్దని చెప్పినా వినలేదన్నారు. ఈ ఘటనలో 47 మంది పోలీసులకు గాయాలయ్యాయని, ఓ పోలీ సుకు కన్నుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శవరాజకీయాలకు సైతం చంద్రబాబు వెను కాడటం లేదనివిమర్శించారు. వాలంటీర్లను కూడా చులకనగా మాట్లాడుతున్నా రన్నారు.

పలువురి బాధితులతో మాట్లాడిన సిఎం

పలువురి బాధితులతో సిఎం జగన్ మాట్లాడారు. వీరికోసం మూడు గంటల సమయాన్ని వెచ్చించారు. క్యాన్సర్ రోగులు, కిడ్నీ సంబంధిత వ్యాధి బాధితులు, అత్యవసరంగా చికిత్స పొందాల్సిన రోగులు వివిధ వ్యాధులు వున్న వారు ముఖ్యమంత్రిని కలిసేందుకు ఉదయం అరు గంటలకే అమలాపురం పోలీస్ క్వార్టర్ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపు వారిని అధికారులు టెంట్లులో కూర్చొబెట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రావడంతో వారిని రోడ్డు పైకి నెట్టేశారు. అగ్ని ప్రమాద బాధితుడు అయిన బాలుని సైతం ఒక తల్లి తీసుకొచ్చి ఎండలోనే ముఖ్యమంత్రి కోసం వేచి ఉంది. విషయం తెలుసుకున్న సిఎం బాధితులను హెలీప్యాడ్ వద్దకు రమ్మని చెప్పారు. దాంతో వంద మందికి పైగా అక్కడకు చేరుకుని సిఎంకి తమ బాధలు విన్నవించారు. వారందరికీ ఆయన సాయం ప్రకటించారు.

వంతెనల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు

అమలాపురం పట్టణంలోని మూడు పాత వంతెనల నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులును సిఎం జగన్ మంజూరు చేశారు. సున్నా వడ్డీ పథకాన్ని ఆయన అమలాపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమలాపురంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిన విషయాన్ని మంత్రి విశ్వరూప్ తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో శిథిలమైన స్థానంలో మూడు వంతెల నిర్మాణాలకు రూ.10 కోట్లు, అమలాపురం నియోజకవర్గ పరిధిలోని 84 సచివాలయాల నిర్మాణాలకు ఒక్కొక్క దానికి రూ.40 లక్షల చొప్పున దాదాపు రూ.30 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

అక్రమ అరెస్టులపై ఖండన

అమలాపురం : సిఎం జగన్ అమలాపురం పర్యటన సందర్భంగా ముందస్తుగా పిడిఎస్‌యు విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు రేవు తిరుపతిరావును అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. సాయంత్రం 5 గంటల వరకు వరకు తిరుపతిరావు నుస్టేషన్లోనే అరెస్టు చేసి ఉంచారని ఇది చాలా అన్యాయమని పిడిఎస్‌యు అమలాపురం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రమేష్, కె.రవి లు తెలుపుతూ అక్రమ అరెస్టులను ఖండించారు.

వికలాంగుల వివరాల సేకరణ

అమలాపురం రూరల్ : అమలాపురంలో శుక్రవారం జరిగిన జగనన్న సున్నా వడ్డీ కార్యక్రమంలో వికలాంగులు పాల్గొన్నారు. నల్ల వంతెన దిగువన ఒక స్టేజి, టెంట్ లు ఏర్పాటు చేసుకుని సిఎం జగన్‌కు ఘన స్వాగతం పలికి వికలాంగులు వారి సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్లాలని అనుకున్నారు. అయితే సిఎం కాన్వాయ్ జిఎంసి బాలయోగి గ్రౌండ్లోకి వెళ్లిపోయింది. దీంతో వికలాంగులు ఆ స్టేజ్ వద్ద ఉండిపోయారు. ఈ విషయం తెలుసుకున్న జెసి ప్రతి వికలాంగుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నియోజకవర్గ సమస్యలపై సిఎం జగన్ కు వినతి

రామచంద్రపురం : రామచంద్రపురం నియోజకవర్గంలో సమస్యలపై ముఖ్యమంత్రి జగన్ కు వినతిపత్రం అందజేశామని న్యాయవాది వైసిపి నాయకులు మాగాపు అమ్మిరాజు విలేకరులలకు తెలిపారు. అమ్మిరాజు మాట్లాడుతూ సమస్యలపై సానుకూలంగా సిఎం స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

భూమిపూజ చేస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-ఆలమూరు

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎంఎల్ఎ, రాష్ట్ర ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పినపళ్లలో ఒఎన్‌జిసి నిధులు, మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న మయపుంత బిటి రోడ్డు పనులకు ఆయన శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, వైసిపి మండల కన్వీనర్ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ సంగీత సుభాష్, ఎఎంసి ఛైర్మన్ వై.నాగేశ్వరరావు, నేతలు రావాడ సత్తిబాబు, మోటుపల్లి వెంకన్న పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు

సిఎంను కలిసిన పిల్లి సూర్య ప్రకాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

అమలాపురంలో వైఎస్‌ఆర్ సున్నావడ్డి పథకం అమలు కార్యక్రమంలో పాల్గొన్న సిఎం జగన్‌ను రాజ్యసభ సభ్యులు పిల్లి. సుభాష్ చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్న సూర్య ప్రకాష్ సిఎంను కలుసుకోవడం చర్చనీయాంశమైంది ఈ విషయమై సూర్యప్రకాష్ ను సిఎంతో ఏం మాట్లాడారని ప్రశ్నించగా జిల్లాకు వచ్చిన ఆయనను ప్రోటోకాల్ ప్రకారం తన తండ్రి బోసు, తాను కలుసుకున్నామని వివరించారు. అమలాపురం వచ్చిన సిఎంను పలువురు ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్యప్రకాష్

సిఎం జగన్‌కు ముందస్తు రాఖీ శుభాకాంక్షలు

మామిడికుదురు : అమలాపురం పర్యటనకు వచ్చిన సిఎంకి పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు కుమార్తె ప్రియాంక శుక్రవారం రాఖీ కట్టి ముందస్తు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్ఎతో పాటు ఆయన భార్య లక్ష్మి, అల్లుడు పిట్టా అన్వేష్ లు హెలిప్యాడ్ వద్ద సిఎం జగన్ ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

సిఎం జగన్‌కు రాఖీకడుతున్న ప్రియాంక

రెండు వారాల్లో కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-అంబాజీపేట

కొబ్బరి ధరల పతనం మార్కెట్ పరిస్థితి రైతు సంఘాల సలహాల స్వీకరణకు ఎపి ఆయిల్ ఫెడ్ ఎండి చావల్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి ఆదేశాల మేరకు శుక్రవారం అంబాజీపేట మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎపి ఆయిల్ ఫెడ్ సమావేశం నిర్వహించింది. ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రెండు వారాల్లో కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా కొనుగోలు కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుందని ఛైర్మన్ గణపతి వీర రాఘవులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐహెచ్ పిఎమ్ సభ్యులు ముత్యాల జమ్మిలు, ఉప్పుగంటి భాస్కరరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి యాళ్ళ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

'జాబ్ బాక్స్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మండపేట

ఐడియల్ యూత్ మూవెమెంట్ మండపేట శాఖ ఆధ్వర్యంలో ఐవైయం జాబ్ బాక్స్ పోస్టర్ ఆవిష్కరణ స్థానిక సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. స్థానిక అధ్యక్షులు అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ యువకుల్లో నిరుద్యోగ సమస్యను తొలగించడమే లక్ష్యంగా ఐవైఎం జాబ్ బాక్స్ పనిచేస్తుందన్నారు. వారిలోని నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వృత్తిపరమైన స్కిల్స్ శిక్షణకు సంబంధించిన సమాచారం ఇచ్చి సరైన మార్గం చూపడం జాబ్ బాక్స్ పని అన్నారు. ఉద్యోగ సమాచారాన్ని అప్ టూ డేట్ బ్లాక్ స్పాట్లో ఉంచుతామన్నారు. జాబ్ బాక్స్ బ్లాగ్ స్పాట్ కోసం https://iymjobbox.blogspot.com లలో చూడాలన్నారు. కార్యక్రమంలో కార్య దర్శి జాబిర్, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14న 'కపిలేశ్వరపురం' మండల సమావేశం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 14న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం. రామకృష్ణారెడ్డి తెలిపారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో సోమవారం ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగే సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొంటా రన్నారు. సమావేశంలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతు ందన్నారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి సభ్యులు, గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, డివిజినల్, మండల స్థాయి అధికా రులు తమ శాఖలకు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

కార్టూ'నిజం'

కొందరికే కల్యాణమస్తు

శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంతో సమాజ అభ్యున్నతి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం ఎస్‌వి డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపల్ మనోహర్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పర్యావరణ విభాగం హిరోషిమా, నాగసాకి డేల దశ దిన కార్యక్రమాల ముగింపులో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జెవివి రాష్ట్ర పర్యావరణ కన్వీనర్ కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక విజ్ఞానం సమాజ అభ్యున్నతికి ఉపయోగపడాలని, మానవ వినాశనానికి కాదన్నారు. మానవతావాది చేతిలో సైన్స్ ప్రజలకు సౌకర్యాలను కల్పించి, అవసరాలను తీరుస్తుందనీ ఉన్మాదుల చేతిలో అదే విజ్ఞానము వినాశనాన్ని సృష్టిస్తుందని అన్నారు. 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో జపాన్లో అమెరికా చేతిలోని సాంకేతిక విజ్ఞానం రెండు పట్టణాలను ధ్వంసంచేసిందన్నారు. అందుకే అణ్వస్త్రాలు వద్దు అన్నవస్త్రాలు కావాలని 'జెవివి' డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రపంచ దేశాలు స్నేహం, సౌభ్రాతత్వాలతో మెలగాలన్నారు. ప్రధాన వక్త డాక్టర్ బి.రాంప్రసాద్ మాట్లాడుతూ సుమారు 2 లక్షల 50 వేల మంది ప్రాణాలు హిరోషిమా, నాగసాకి అణ్బాంబు విస్ఫోటనంలో చనిపోయాయన్నారు.. అందులో 90 శాతం పైగా పౌరులే ఉన్నారని అన్నారు. యుద్ధోన్మాదం ఫలితంగా అణు బాంబు విస్ఫోటనం వలన నేటికీ అక్కడి భూమిలో పంటలు పండడంలేదు. చాలామందికి సంతానం యోగం లేదన్నారు. పుట్టిన వారిలో ఎక్కువమంది శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు.. అదే యుద్ధం నుంచి గుణపాఠం నేర్చుకున్న జపాన్ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం ను ఉపయోగించి పూర్వ అభివద్ధి స్థాయికి చేరుకుందన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డా. ఇఆర్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక విద్యార్థుల్లో, ప్రజలలో శాస్త్రీయ అవగాహనకు, అక్షర ఉద్యమం, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పనిచేస్తుందన్నారు. ఆ వాణిని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థి చెకుముకి సైన్సు మాస పత్రిక ద్వారా వినిపిస్తుందన్నారు. దేశ స్వావ లంబన, ప్రపంచ శాంతి కోసం పరితపిస్తోందన్నారు. అందుకే హిరోషిమా, నాగసాకి డేల సందర్భంగా గుణపాఠం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ ప్రవీణ్, సీనియర్ ఫ్యాకల్టీ వరప్రసాద్ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర పర్యావరణ కన్వీనర్ కెవివి.సత్యనారాయణ

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

భారత స్వాతంత్ర్యోద్యమ లక్ష్య సాధన కోసం విద్యార్థులంతా క్రమశిక్షణతో మెరుగైన విద్యను అభ్యసించాలని శ్రీ సిద్ధార్థ కళాశాలల ఛైర్మన్ వాకా దివ్య శేఖర్ అన్నారు. శుక్రవారం అంగర శ్రీసిద్ధార్థ కళాశాల ఆవరణలో 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు 77వ ఆకతిలో నిలుచుని దేశభక్తిని చాటుకున్నారు. మువ్వన్నెల జెండా చేతబట్టి భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుతామంటూ నినాదాలు చేశారు. భారతదేశం అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలంటూ సిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ వాకా రాజా ఆకాంక్షించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను నిత్యం స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.రమణ, అధ్యాపక సిబ్బంది, జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

77వ ఆకృతిలో శ్రీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

13న టిడిపి ఆధ్వర్యంలో 'బిసి పోరుబాట'

ప్రజాశక్తి-అయినవిల్లి

మండపేట బస్టాండ్ వద్ద సూర్య మహల్ ఫంక్షన్ హాల్ నందు మండపేట నియోజకవర్గంలో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు రాష్ట్ర శెట్టిబలిజ సాధికార కమిటీ అధ్యక్షులు కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో బిసి పోరుబాట-టిడిపి శెట్టిబలిజ సాధికార సమావేశం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బిసి విభాగం అధ్యక్షులు, పాలిటిబ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, రామచంద్రపురం టిడిపి ఇంచార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు ముఖ్య నాయకులు విచ్చేస్తున్నారు. రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, శెట్టిబలిజలతా ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయలని అయినవిల్లి మండలం అయినవిల్లికి చెందిన రాష్ట్ర బిసి విభాగం శెట్టిబలిజ సాధికార మీడియా కోఆర్డినేటర్ కుడుపూడి దుర్గారావు కోరారు.

త్వరలో' గ్రామ.. గ్రామానికీ.. కాంగ్రెస్'

ప్రజాశక్తి-అయినవిల్లి

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుకామన ప్రభాకర్ గారి ఆదేశాల మేరకు పి. గన్నవరం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామంలో వీవర్స్ కామన్ ఫెసిలిటీ భవనంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి నియోజకవర్గ కన్వీనర్ సంగీత సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలని అన్ని మండలాలు లో అన్ని గ్రామాలలో కమిటీలు వేయాలని అన్నారు. గ్రామ గ్రామానికి కాంగ్రెస్ కార్యక్రమం త్వరలో అమలు చేస్తాము అన్నారు. కార్యక్రమం లో పిసిసి సభ్యులు ములపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ పి. గన్నవరం సమన్వయ కమిటీ సభ్యులు మహమ్మద్ ఆరిఫ్, నెల్లి వెంకటరమణ, అప్పన శ్రీ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గొడవర్తి' మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని పెదపళ్ళ టిడిపి అధ్యక్షుడు గొడవర్తి నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివ్యక్తిగతంగానూ మంచి మిత్రుణ్ణి కోల్పోయామన్నారు. నాగేశ్వరరావు కుమార్తెకు కేరళ లోని సెంట్రల్ గవర్నమెంట్ ధర్నోలో ఉన్నత వైద్య చదువు కోసం సీటు రావడంతో జాయిన్ చేయడానికి వెళ్లి, ఆయనకు హార్ట్ ఎటాక్ కు గురికావడం దురదృష్టకరమన్నారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగేశ్వరరావు మృతికి మండల టిడిపి నేతలు సంతాపం తెలిపారు.

సమన్వయంతోనే మండలాభివృద్ధి

ప్రజాశక్తి-రాజోలు

మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివద్ధికి పాటు పడాలని ఎంపిపి కేతా శ్రీనివాస్ కోరారు. రాజోలు ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి కేతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ ఎన్.బాలాజీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివద్ధి పనులపై చర్చించారు. ముందుగా వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. ఎంపిపి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం తగదన్నారు. సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఒకు సూచించారు. పలు శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న అభివద్ధి పనులను ఈ సమావేశంలో వివరించారు. కడలి సర్పంచ్ చొప్పల గుణనాథ్ మండలంలో జరిగే పలు అంశాలపై అధికారులను నిలదీశారు. విద్యుత్ శాఖ, ఇరిగేషన్ శాఖ, డ్రైనేజీ శాఖల్లో ఉన్న సమస్యలపై శివకోటి సర్పంచ్ నక్కా రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు విద్యుత్ సరఫరా సక్రమంగా చేయకపోవడంతో పాటు ఆక్వా సాగు కు నిత్యం విద్యుత్ సరఫరా చేస్తున్నారని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తొలుత సమావేశం కోరం అవ్వకపోవడంతో అనుకున్న సమయం కంటే ఆలస్యంగా సమావేశం ప్రారంబించారు దీంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు ఇంటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యాం బాబు, డిటి శ్రీనివాస్, వివిధ శాఖల ఆదికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, అధికారులు

కంది సాగుతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

తొలకరి వరి చేల్లో గట్లు చుట్టూ కందిచెట్లు పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ అన్నారు. కె. గంగవరంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఇళ్ల సూర్యనారాయణ మాట్లాడుతూ తొలకరి పంట 2023కి సంబందించిన పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, ౖతులందరూ తప్పని సరిగా వరితో పాటు ఇతర ఉద్యానవన పంటలు నమోదు చేయిచుకోవాలన్నారు. భవిష్యత్తు లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఇదే ప్రాతిపదిక అవుతుందని దీనిని రైతులంతా గమనించాలని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందించే కందులను వరి గట్ల చుట్టూ పెంచుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందే దిశగా కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కందులు కావలసినవారు స్థానిక రైతు భరోసా కేంద్రాల లో సంప్రదించి గట్ల మీద చల్లుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బలుసురవిమాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా చిరుధాన్యాల పెంపకం పట్ల రైతులలో అవగాహన కొరకు మరియు చిరుధాన్య పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచడంలో భాగంగా ప్రభుత్వం రాగులు మరియు కొర్రలు కొద్ది మొత్తంలో ప్రయోగాత్మకంగా పంపిణీ చేయడానికి సిద్ధమైందన్నారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నటువంటి గ్రామాలు మరియు మిగిలిన గ్రామాల్లో మిగులు భూములు లేదా దిమ్మలు వ్యవసాయానికి పనికివచ్చే సాగులో లేని భూముల్లో వేసుకొని చిరుధాన్యాల పెంపకం ద్వారా అదనపు ఆదాయం మరియు తద్వారా వాటిని ఉపయోగించుకోవడం వల్ల మంచి ఆరోగ్యం రెండు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ భత్తుల అప్పారావు, మండల ఉద్యానవన అధికారి అనూషా, కోటిపల్లి ఇరిగేషన్ ఎఇ సుబ్బారావు, పశు వైద్యులు రామరాజు, అన్ని గ్రామాల వ్యవసాయ ఉద్యాన సహాయకులు రైతులు పాల్గొన్నారు..

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఇళ్ళ సూర్యనారాయణ

చెముడులంకకు తిర్నాతి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-ఆలమూరు

స్వాతంత్ర్య సమర యోధులు తిర్నాతి సూర్య నారాయణ మూర్తి చెముడులంక గ్రామాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఉమ్మడి డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు కొనియాడారు. అజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా భారత ప్రభుత్వం తరపున స్వాతంత్ర్య సమర యోధులు అవార్డుకు తిర్నాతి సూర్య నారాయణ మూర్తిని ఎంపిక చేశారని ఆకుల పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన 'నా భూమి నా దేశం' కార్యక్రమంలో భాగంగా తిర్నాతి గౌరవార్థం ఆయన కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.జాన్ లింకన్, ఎంపిటిసి తమ్మన భాస్కరరావు, ఎన్నారై రాయుడు వెంకటేశ్వరరావు, తిర్నాతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిర్నాతి కుటుంబసభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

పలుచోట్ల 'నాదేశం-నాభూమి'

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల నాదేశం-నాభూమి కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. **మండపేట:** జెడ్ మేడపాడు గ్రామంలో నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వసుధకు వందనం కార్యక్రమం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, ఎంపిటిసి సభ్యుడు దేవు ప్రసాద్ నాయుడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ వైసిపి పార్టీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వి. అమర్నాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం :** వీరులకువందనములు కార్యక్రమం లో భాగంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు జరిగే శిలాఫలకాల ఆవిష్కరణ హసన్ బాద గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు,గ్రామ ఉపసర్పంచ్ నీలం భవాని తదితరులు పాల్గొన్నారు. యనమదల గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ పివివి. రమణ ఆధ్వర్యంలో శివల గ్రామంలో సర్పంచ్ అనసూరి సాయిబాబు ఆధ్వర్యంలో శిలాఫలకాలు ఆవిష్కరించారు.

మొక్కలునాటుతున్నజెడ్.మేడపాడు సర్పంచ్

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తపేట

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ ఐ.బ్రహ్మాజీరావు తెలిపారు. వాడపాలెం మారెమ్మ మాన్యంకు చెందిన బండారు వెంకటేశ్వరరావుకు, వెంకటలక్ష్మి (52)కి వివాహమై 32 ఏళ్లవుతోంది. వీరికి ఇద్దరు కుమారులు. వీరిలో మొదటి కుమారుడు సుబ్రహ్మణ్యం ఖాళీగా ఉండటంతో తరచూ తండ్రి మందలిస్తున్నాడు. గురువారం రాత్రి తండ్రి కుమారుని మందలిస్తుండగా తల్లి వెంకటలక్ష్మి మనస్తాపం చెందింది. పడక గదిలోకి వెళ్లి చున్నీతో కిటికీకి ఉరేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు మరణించినట్లు నిర్ధారించారు.

బైకులు ఢీకొని గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రాజపూడిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి కాలు నుజ్జు నుజ్జు కాగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజపూడికి చెందిన నంగన సత్తిబాబు జగ్గంపేట వైపు వెళ్ళతుండగ జగ్గంపేట వైపు నుంచి సామర్లకోటకు చెందిన ముగ్గురు ఒకే బైకుపై వచ్చి ఢీ కొట్టారు. దీంతో సత్తిబాబు కాలు నుజ్జు నుజ్జయ్యింది. అతన్ని స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోటకు చెందిన ముగ్గురు వ్యక్తులను జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటనకు సంబంధించి వివరాలు సేకరించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో రహదారిపై ముందు వెళుతున్న బైకును కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు మేరక మల్లేపల్లికి చెందిన కోడిగుడ్ల వీరబాబు, గొల్లవిల్లి లోవరాజు, గండేపల్లి నుంచి మల్లేపల్లి వైపు వెళుతుండగా రాజమండ్రి వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న కారు ఢీకొనడతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడి వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు



తాళ్లరేవు పంచాయతీ ముత్యాలమ్మ గుడి వద్ద మెయిన్ రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాళ్లరేవు పంచాయతీ గుత్తులవారి పాలేనికి చెందిన వాసంశెట్టి ప్రసాద్(44) మృతి చెందాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు వాసంశెట్టి ప్రసాద్, తాళ్లరేవు గాంధీనగర్‌కు చెందిన పొలిమాటి సురేష్ ముత్యాలమ్మ గుడి సమీపంలో బైకులపై ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. పొలిమాటి సురేష్‌కు గాయాలయ్యాయి. గాయాలైన పొలిమాటి సురేష్ మద్యం సేవించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ జవాన్లకు ఘన సన్మానం

పెద్దాపురం : ఆజాదీకీ అమృత్‌లో భాగంగా స్థానిక అంకయ్యపేటలోని 10, 11వ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన మన మట్టి మన దేశం కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్లు చింతా శ్రీకాంత్, పిల్లా రామ్మోహనరావును పూలమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు నీలంశెట్టి అమ్మాజీ, ఆరేళ్ల వీరరాఘవ, విడదాసరి రాజా, వైసిపి నాయకులు నీలంశెట్టి పండు, చింతా శ్రీనివాసరావు, సచివాలయం అడ్మిన్ బాలాజీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సేంద్రియ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- కడియం

అందరూ బాగుండాలి, అందులో వైసిపి ప్రభుత్వం ఉండాలి అనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్‌సి రైతులకు రైతు సాధికార సంస్థ, ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సీడ్ టు సీడ్ కిట్లును చందన నాగేశ్వర్ శుక్రవారం పంపిణీ చేశారు. రైతులంతా ఈ కిట్లును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి కెమికల్స్ వాడకుండా ఆరోగ్యకరమైన ఆహారం పండించడానికి రైతులకు అండగా ఈ కిట్లును అందిస్తున్నామనానరు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం వైసిపి మాత్రమేనన్నారు. ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు తమ ఉనికి చాటు కోవడానికి లేని పోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, వైసిపి అధ్యక్షుడు తాతపూడి బాబి, ఎంపిటిసి సభ్యులు నాగరాజు, కె.నాని, పంచాయతీ కార్యదర్శి సరోజారాణి, కంటిపూడి సాయి, ఐ.లక్ష్మణ్, ఐసిఆర్‌పి.సూర్యకుమారి, సుహాసిని, వేణి, రైతులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో శుక్రవారం ప్రభాత్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ రాజవోలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఏర్పాటు కు సహకరించిన ప్రభాత్ ఇండియా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు వీలుగా ప్రతి ఇంటికీ రెండు డస్ట్ బిన్‌లను అందిస్తామన్నారు. చెత్తను సేకరించేందుకు రెండు బ్యాటరీ రిక్షాలను అందించారని తెలిపారు. తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఒ సత్యనారాయణ, ప్రత్యేక అధికారి ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి కాశి, ప్రభాత్ ఇండియా సంస్థ ప్రతినిధులు భువన, జీవా, నాయకులు నక్కా రాజబాబు, నక్కా శ్యాంబాబు, పెయ్యల రాజేష్, డాకే శ్రీను, ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

'హర్ ఘర్ తిరంగా'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - యానాం

యానాంలో 76వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్ఎఒ మునిస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుండి 15 వరకు ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఎగరవేయాలని సూచించారు. జాతీయ జెండాను కొనుగోలు చేసేవారు రూ.18 చెల్లించి మినీ సివిల్ స్టేషన్‌లో మొదటి అంతస్తులో ఉన్న జిల్లా పరిశ్రమల కార్యాలయంలో పొందాలన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు డిస్ట్రిక్ట్ డి-అడిక్షన్ సెంటర్ ద్వారా శుక్రవారం స్థానిక అయ్యన్న నగర్ గ్రామంలో చిన్నారులకు వారి తల్లిదండ్రులకు మాదకద్రవ్యాలు వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. చిన్న వయసు నుంచే యువత మందు, సిగరెట్, గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసవుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలకు లోనైన వారికి డిస్ట్రిక్ట్ డి - అడిక్షన్ సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో' హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ పరాయి పాలనలో బానిసత్వం నుంచి విముక్తి కావడానికి సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని ఎన్నో పోరాటాలు చేసి స్వాతంత్రాన్ని సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, సత్యనారాయణ పాల్గొన్నారు.

భరతమాత ముద్దుబిడ్డ కుధీరామ్ బోస్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

చిన్నతనం నుంచి విప్లవాత్మక భావాలతో స్వాతంత్ర ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన కుధీరాంబోస్ భారతమాత ముద్దుబిడ్డ అని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కుధీరామ్ బోస్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1908 ఆగస్టు 11న బెంగాల్లో జన్మించిన కుధీరామ్ బోస్ భారతదేశాన్ని వేధిస్తున్న బ్రిటిష్ అధికారిపై బాంబు వేసిన మొదటి సాహస వీరుడన్నారు.

కండ్లకలకలు పిల్లల్లో సహజం

ప్రజాశక్తి కాకినాడ రూరల్

ఎలర్జీ, ఇన్ఫెక్షన్ కారణంగా కళ్ళకలక వస్తుందని, ఇది పిల్లలలో సహజమని పండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంఎల్ హెచ్‌పి వాసంశెట్టి సంతోషి సత్య పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కళ్ళు దురద, వాచి ఎరుపెక్కడం, స్రావం కారడం కండ్ల కలక ప్రధాన లక్షణాలని అన్నారు. కండ్లకలక సోకిన వారు ఉపయోగించిన వస్తువులను తాకడం ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వాళ్ళ వాడిన దుస్తులు, దుప్పట్లు, టవల్స్ ఇతరులు వాడరాదన్నారు. కళ్లను తుడవడానికి శుభ్రమైన మెత్తని వస్త్రాన్ని ఉపయోగించాలన్నారు. ఇది మూడు నుంచి ఏడు రోజులలో తగ్గిపోతుందన్నారు. ఇదేమి ప్రమాదం కాదని సంతోషి సత్య తెలిపారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి కాజులూరు

ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా రైతులు కౌలు రైతులు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎన్.విజయకుమార్ కోరారు. శుక్రవారం తర్లంపూడి, జగన్నాథగిరి, ఆర్యవటం, గొల్లపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈక్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులు కౌలు రైతులు ఈ క్రాప్ నమోదు ద్వారా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే అన్ని పథకాలతో పాటు బీమా కూడా వర్తిస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ క్రాప్ నమోదు వేగవంతంగా నిర్వహిస్తున్నామని, కాజులూరు మండలంలో సుమారు 18 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కరప ఎడిఎ బాబూరావు, కాజులూరు వ్యవసాయ అధికారి అశోక్, సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు ప్రసాద్, శిరీష పలువురు రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు రూ.2లక్షల మంజూరు

ప్రజాశక్తి - నల్లజర్ల

పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2లక్షలు మంజూరు చేసిందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్‌పి చైర్మన్ గంటా పద్మశ్రీప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, మౌలిక సదుపాయాలు వంటి అనేక కార్యక్రమాలను చేస్తుందన్నారు. బడి ఈడు పిల్లలందరూ విద్యార్థి దశలో చక్కగా చదువుకొని రాణించాలన్నారు. నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలోని జడ్‌పి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్, నాడు- నేడు పనులను పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడారు. పాఠశాలలో క్రీడా ప్రాగణం సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు ముప్పిడి లక్ష్మి, సర్పంచ్ ఎన్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సమన్వయ కమిటీ కన్వీనర్ మహమ్మద్ ఆరిఫ్ పిలుపునిచ్చారు. ఉప్పలగుప్తం లోని ఎఐసిసి కోఆప్షన్ సభ్యుడు చీకట్ల అబ్బాయి స్వగృహం వద్ద ఆరిఫ్ అధ్యక్షతన శుక్రవారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామ గ్రామానికి కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని తీర్మానించారు. సమన్వయ కమిటీ కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టిన ఆరిఫ్‌ను సత్కరించారు. సమావేశంలో ఎఐసిసి సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, పిసిసి సభ్యురాలు అయితాబత్తుల సుభాషిని, దోనిపాటి విజయలక్ష్మి, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ఫేర్‌వెల్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్‌కు సంబంధించిన ఎంబిఎ ఎం.కామ్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు వారి సీనియర్స్‌కు 'బోన్ వయోగ్ భాష్' అనే పేరున ఫేర్వెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కమల కుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉపాధ్యాయుల తర్వాత సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉంటూ వారు ఉపాధి ఉన్నతికి, దిశా నిర్దేశకాలు చేసేవారిగా ఉపయోగపడతారని, ఎంబిఎ, ఎంకామ్ విద్య అభ్యసించిన అనంతరం తాము ఎంచుకున్న రంగాల్లో అభ్యున్నతిని సాధించి యూనివర్సిటీకి, వారి కుటుంబ సభ్యులకు మంచి పేరు తేవాల్సిందిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ హెచ్ఒడి డాక్టర్ అజయ్ రతన్ అధ్యాపకులు డాక్టర్ రామరాజు, డాక్టర్ అనిల అంబిక, డాక్టర్ మధు కుమార్, మణికంఠేశ్వర్ రెడ్డి, మనోజ్ దేవ, డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమా రజిత తదితర బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాలతోడులో టిడిపి 'మహాశక్తి'

ప్రజాశక్తి-మండపేట

పాలతోడులో టిడిపి ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం ఆపార్టీ నాయకులు పిల్లా తాతాలు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. గ్రామంలో ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోలోని ప్రకటించిన పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో గ్రీన్ కలర్ డే

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్లో గ్రీన్ కలర్ డే శుక్రవారం నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థులకు రంగులపై అవగాహన కల్పించడంలో భాగంగానే ఇటువంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పచ్చని రంగు దుస్తులు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. గ్రీన్ కలర్ లో ఉన్న వస్తువులను ప్రదర్శనలో ఉంచి వాటి పేర్లు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్చార్జి నరేష్, వైస్ ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే మట్టు పెట్టాడు..

తల్లీ బిడ్డలను గోదావరిలో తోసిన సురేష్ అరెస్టు

ప్రజాశక్తి-రావులపాలెం

శారీరకంగా.. ఆర్థికంగా వాడుకున్నాక అవసరం తీరిందనుకున్న కసాయి మొత్తం ఆ కుటుంబాన్ని మట్టు పెట్టాలని పథకం రచించి అమలు చేసినట్లు రావులపాలెం పోలీసులు తెలిపారు. తల్లి కూతుళ్లను రావులపాలెంలోని గౌతమి గోదావరిలో నెట్టివేసి ఇద్దరి మరణానికి కారకుడైన నిందితుడు ఉలవ సురేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం చామంతపూడి గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి అప్పటికే ఒక కుమార్తె ఉన్న పుప్పాల సుహాసిని అనే మహిళతో 2019 నుంచి సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో వారిద్దరికీ ఒక పాప జన్మించింది. సుహాసిని అనేకసార్లు సురేష్‌కు ఆర్థిక సాయం చేసింది. ఇటీవల సురేష్, సుహాసిని మధ్య వివాదాలు నెలకొన్నాయి. సురేష్ ఇటీవల మరో మహిళను వివాహం చేసుకున్నట్టు తెలియడంతో సుహాసిని నిలదీసింది. తన దగ్గర వాడుకున్న డబ్బులు అడిగింది. దీంతో కక్ష గట్టిన సురేష్ ముగ్గురినీ మట్టు పెట్టాలని ప్రణాళిక రచించాడు. ఈ క్రమంలో రాజమండ్రిలో దుస్తులు కొనుక్కుందాం అంటూ వారందరినీ నమ్మించి కారులో తీసుకొచ్చాడు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం రాజమండ్రి చూపించి అక్కడి నుంచి రావులపాలెంలోని గౌతమీ గోదావరి వద్దకు తీసుకు వచ్చాడు. అక్కడ సెల్ఫీ తీసుకుందాం రమ్మంటూ గౌతమి పాత బ్రిడ్జి వద్ద కారును ఆపి వారిని దింపాడు. ముందుగా సుహాసిని(35)ని గోదావరిలోకి గెంటేశాడు. అనంతరం తనకే పుట్టిన ఏడాది వయసున్న జెర్సీని కూడా గోదావరిలోకి విసిరేశాడు. ఈ క్రమంలో కారు దిగి పారిపోతున్న సుహాసిని మొదటి కుమార్తె 13 ఏళ్ల లక్ష్మీ సాయి కీర్తన వెనుకే పరుగులు తీసి ఆమెను కూడా పట్టుకుని గోదావరిలోకి విసిరేసాడు. అందరూ చనిపోయారని భావించి అక్కడ నుంచి సురేష్ కారులో పరారయ్యాడు. సుహాసిని, జెర్సీలు గోదావరిలో కొట్టుకుపోగా లక్ష్మీ సాయి కీర్తన కేబుల్ పైపును పట్టుకుని వేలాడుతూ ప్రాణాలు దక్కించుకుంది. రావులపాలెం సి.ఐ రజినీకుమార్, ఎస్క్ష్మి వెంకటరమణ నిందితుడు సురేష్‌ను ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ వద్ద అరెస్టు చేశారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరంలో కొన్నేళ్లుగా వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న అన్నవరం రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు దత్తు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పర్వత మాట్లాడుతూ క్లబ్ సభ్యులు సొంత బిల్డింగు కొట్టుకోవాలని తన దృష్టికి తెచ్చారని దీనిపై గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి సభ్యుల సహకారంతో పంచాయతీ స్థలం ఇప్పించినట్టు చెప్పారు. అధ్యక్షునిగా యడ్ల శ్రీనివాస్, కార్యదర్శిగా కొండ వేణుగోపాలరావు, కోశాధికారిగా అరిగల తాతయ్య దొర ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్ బాబు, క్లబ్ సభ్యులు పి.వెంకట్ రవి, కేశవరాజు, దాసరి శ్రీను, ఎస్ఐ కిషోర్ బాబు, సర్పంచ్ ఎస్.కుమార్ రాజా ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్న బాబు పాల్గొన్నారు.

18న మండల సమావేశం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18న సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ అబ్రహాం లింకన్ శుక్రవారం తెలిపారు. 18న నిర్వహించే సర్వసభ్య సమావేశంలో మండల స్థాయి అధికారులు హాజరవ్వాలని, లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రముఖ గాంధీయవాది ఉషా మెహతా

కాకినాడ రూరల్ : ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు ఉషా మెహతా మహాత్మా గాంధీ ఆలోచన, తత్వాన్ని సంవత్సరాలపాటు వ్యాప్తి చేసిన గాందేయవాది అని సాహిత్య వేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఉషా మెహతా వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైమన్ కమిషన్, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో ఆమె చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో వార్తలను ప్రసారం చేయడానికి రహస్య రేడియో సర్వీసును ఆమె నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. ఖాదీ బట్టలు మాత్రమే ధరించి నిరాడంబరంగా ఆమె జీవించారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

పెద్దాపురం : వాలుతిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీలోహిత బ్రాండ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక శ్రీవీర్రాజు హైస్కూల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వాతంత్ర పోరాట ఘట్టాలను చిత్రించారు. ఈ పోటీలను హెచ్‌ఎం కెవి.లక్ష్మీనారాయణ, డ్రాయింగ్ టీచర్ వాణి పర్యవేక్షించారు. అనంతరం సంస్థ తరపున హాజరైన సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ మాట్లాడుతూ ఆగస్టు 15న విజేతలందరికీ బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

పంచాయతీ కార్మికులకు జీతాలివ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక లక్ష్మీ దాసు భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల కార్మికుల పట్ల పాలకులు ఉన్నతధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పారిశుధ్య కార్మికులు నెలనెల వేతనాలు అందక ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల సమస్యలు పరిష్కారంపై పాలకులు అధికారులు అలివిమాలిన నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏళ్లతరబడి పోరాడి సాధించుకున్న జిఒలు సైతం అమలకు నోచుకోని దుస్థితి జిల్లాలో నెలకొందని వాపోయారు. ప్రభుత్వాలు.. లాఠీ దెబ్బలకు వెరవకుండ పోరాడి సాధించుకున్న జిఒలను అధికారులు కాగితాల్లోనే మగ్గబెడుతున్నారని అన్నారు. గ్రామ పంచాయతీల్లో బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికులకు పెండింగ్ వేతనాలతో పాటు, పిఎఫ్, ఇఎస్ఐ, మాస్కులు ఐడెంటి కార్డ్స్ దుస్తులు, సబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. గతంలో వేతనాల సమస్యపై కార్మికులతో కార్యాల యాన్ని ముట్టడించి వినతిపత్రం అందించామన్నారు. డిపిఒ దీనిపై స్పందించి వేతనాలు చెల్లించేవిధంగా పంచాయతీ అధికారులకు ఆర్డినెన్స్ జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ తక్షణమే అమలు చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు చట్ట ప్రకారంగా అమలు చేయాలని, లేనిపక్షంలో డిపిఒ ఆఫీస్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

పెన్షనర్స్ కార్యదర్శిగా సాయి

కాకినాడ కార్పొరేషన్ : గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కాకినాడకు చెందిన సలాది సాయి సత్యనారాయణను ఎన్నుకోవడం జరిగింది. కార్యవర్గ సభ్యునిగా రాజమహేంద్రవరానికి చెందిన వి.లక్ష్మయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షన్‌దారుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ ఎన్నిక పట్ల ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సంజయ్ గౌరవాధ్యక్షుడు గట్టి రామారావు, లైబ్రేరియన్లు ములంపాక శ్రీనివాసరావు, రేపాక వెంకటరాము, జిల్లా పెన్షనర్స్ హర్షం వ్యక్తం చేశారు.

భారాలు మోపిన ప్రభుత్వాన్ని దించేద్దాం

ప్రజాశక్తి కాకినాడ రూరల్

ప్రభుత్వ ముందుచూపు లేమితో వర్షాకాలంలో సైతం విద్యుత్ కోతలు విధిస్తున్నారని, రాష్ట్ర ప్రజలపై ఛార్జీలు పెంచుతూ పెనుభారం మోపుతున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని రూరల్ మండలం ఇంద్రపాలెంలో శుక్రవారం టిడిరి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో 'మహాశక్తి-భవిష్యత్తు గ్యారెంటీ'లో భాగంగా 'వస్తున్నా- మీ గ్రామానికి- మీ అనంతలక్ష్మి' 25వరోజు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో జెడ్ బ్రిడ్జి సెంటర్ నుండి ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. భవిష్యత్తుకు గ్యారెంటీ హామీలకు మద్దతు తెలపడానికి 9261292612 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లగా రాష్ట్రంలో అధికారం ఉన్న వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలను ఇబ్బడిముబ్బడిగా పెంచి వినియోగదారులపై భారం మోపిన ప్రభుత్వం అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు మరింత బెంబేలెత్తిపోయేలా చేస్తుందన్నారు. రాత్రి సమయాలలో సైతం విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో కాకుండా అర్ధరాత్రి దాటిన తరువాత విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. ఇక వ్యవసాయానికి ఎప్పుడు సరఫరా అవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ సిబ్బంది సైతం సమ్మెకు దిగేందుకు సిద్ధం కావటంతో చర్చల పేరుతో విద్యుత్ ఉద్యోగ సంఘాల మధ్య ప్రభుత్వం చిచ్చు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసిలు బుంగా సింహాద్రి, మట్టా ప్రకాష్ గౌడ్ క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిదే నాగ హరినాథ్, పండూరి జయకృష్ణ, మరుకుర్తి నాగబాబు, పంపన బుజ్జి, పుల్లయ్య, శ్రీను, గుత్తుల మురళి, టేకుమూడి శ్రీను, కాకరపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ కార్యకర్తకు ఆదిరెడ్డి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

టిడిపి సీనియర్ కార్యకర్తకు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సాయం అందించారు. స్థానిక 45వ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన రజాల రాము పక్షవాతంతో బాధపడుతున్నారు. నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఆదిరెడ్డి శ్రీనివాస్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాజమండ్రి పార్లమెంట్ కమిటీ కార్య నిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ, మాజీ కార్పొరేటర్ తాడి మరియ, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, ఉపాధ్య క్షులు ఉప్పులూరి జానకి రామయ్య, తెలుగు మహిళ రాష్ట్ర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి తురకల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నా భూమి-నా దేశం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, తాళ్లరేవు

నా భూమి నాదేశం అన్న నినాదంతో గ్రామంలో పచ్చదనం పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించే బాధ్యత అందరిపైనా ఉందని సర్పంచ్ శీలం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సర్పవరంలో గ్రామకార్యదర్శి ఆర్.వి.సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. గ్రామంలో సుమారు 600లకు పైగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. వైకాపా నేత పుల్ల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, వార్డు సభ్యులు పుల్ల చక్రధర్, వాసంశెట్టి గోవిందు, పుల్ల శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు. తాళ్లరేవు మండలంలో ఎంపిపి రాయుడు సునీత చొల్లంగి పంచాయితీ, ఉప్పాంగల పంచాయతీ పరిధిలో పలు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని అన్నారు. ఈ సందర్భంగా చొల్లంగిలో విద్యార్థులు ఉపాధి కూలీలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూరెల వెంకటరాజు, ఉప్పాంగల సర్పంచ్ శాఖ శంకరుడు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, స్వర్ణ రాజు, వారా సూర్య కుమారి, దవులూరి శ్రీరామ్మూర్తి, మాసా శ్రీనివాస్, శివాజీ గణేష్, ఎపిఒ అన్నపూర్ణ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A.731/2022 in O.S.522/2012

Between :
Kumari Mithipati Mahathi Lakshmi, being Minor, Rep. by her mother and guardian, Dr. Mithipati Vani Lakshmi & another ...Petitioner/Plaintiff
And:
Sri Mithipati Rama Subba Rao & 5 others ...Respondents/Defendants

NOTICE

To,
R-4: Smt. Chavali Kameswari, D/o. M. Suryanarayana, R/at D.No.3-1-163/B, Sudarshana, Amalapuram, East Godavari District. (A.P)
R-5: Smt. M. Lalitha, D/o. M. Suryanarayana, Rest-do-
R-6: M/s. GRT Hotels and Resorts Private Limited, Rep. by its Chairman Sri G. Rajendran, S/o. Sri Govindarajulu, having its Registred Office at 136 Usman Road, T.Nagar, Chennai-600017.

Please take notice that the petitioner/plaintiff herein has filed the above I.A.731/2022 in O.S.522/2012 for restoration of the above suit by setting aside the dismissed for default order made against the petitioner/plaintiff dated 01-10-2019. You all are therefore, required to appear in person or through a duly instructed Advocate/Pleader on **28-08-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions and in case of your failure to do so you will be set ex-parte and the matter would be decided in your absence

O. SRINIVAS,
K. Bhavani Shankarudu,
Advocates, Visakhapatnam

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 191/2022

మధ్య:
బలుసు కృష్ణ భగవాన్, తండ్రి: సుబ్బారావు (లేటు), హిందూ, డోర్ నంబరు: 3-153, చెల్లూరి గ్రామం, రాయవరం మండలం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా. -వాది
మరియు
బలుసు సరోజిని వగైరాలు -ప్రతివాద్లు

డి-2: బలుసు శ్రీహరి (జిపిఏ హోల్డర్), శ్రీమతి కొరిపిల్లి బులిరాణి, భర్త: విశ్వేశ్వరరావు, బ్లాక్-ఎ, ఎ-44-64, ప్లాట్ నంబరు 403, 4వ ఫ్లోర్, సౌభాగ్య రెసిడెన్సీ, వెంగళరావు నగర్, ఎస్.ఆర్.నగర్ పోస్టు, హైదరాబాద్ - 500038.
డి-6: బలుసు శేషుబాబు, తండ్రి: సుబ్బారావు, ఇంటి నంబరు: బి-185, ప్రకృతి నివాస్, అన్నారం, మెదక్ జిల్లా, తెలంగాణా - 502313.
డి-7: శ్రీమతి కొరిపల్లి బులిరాణి, భర్త: విశ్వేశ్వరరావు, బ్లాక్-ఎ, ఎ-33 మరియు 64, ప్లాట్ నంబరు 403, 4వ ఫ్లోర్, సౌభాగ్య రెసిడెన్సీ, వెంగళరావు నగర్, ఎస్.ఆర్.నగర్, పోస్టు, హైదరాబాద్ -500038.
డి-11: బోళ్ల వెంకటరమణ, తండ్రి: గంగరావు, డోర్ నంబరు 4-118, మునసబుగారి వీధి, తాటిపాక, రాజోలు, తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నెంబరు దావాలో మీరు డి2, డి6, డి7, డి11 ప్రతివాదులు అయి యున్నారు. సదరు దావాలో మీకు కోర్టు నుండి, పోస్టు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ తీసుకోక కాలయాపన చేయుచున్నారు. కావున పై నెంబరు దావా **ది. 31-08-2023 సంవత్సరం తేదీన** వాయిదా అయివున్నది. కావున ఆరోజు **ఉదయం 10.30 నిమిషాలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని ఎడల కోర్టు వారు మీ పరోక్షాన తీర్మానించబడును.

(బై కోర్టు ఆర్డర్)
డాక్టర్ సి.వి.ఎన్.శ్రీహరి
అనపర్తి అడ్వకేట్, రాజమహేంద్రవరం
10-8-23 తూర్పుగోదావరి జిల్లా

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P.No. 41/2023

బిట్వీన్:
తెన్నేటి వెంకట సూర్య రామలక్ష్మి ...పిటీషనర్
మరియు
తెన్నేటి వెంకట లక్ష్మి వీర రాఘవేంద్ర నాగ సుధాకర్ ...రెస్పాండెంటు

టు: తెన్నేటి వెంకట లక్ష్మి వీర రాఘవేంద్ర నాగ సుధాకర్ తండ్రి శివ సత్య ప్రసాద్, ప్రైవేటు ఉద్యోగం, హిందూ, వయస్సు 44 సం॥లు, సుబ్బయ్య గారి హెూటల్ దగ్గర, శంకర మఠం వీధి, రామారావు పేట, కాకినాడ, కాకినాడ జిల్లా.

పై నెంబరుగల పిటీషనులో పై తెలుపబడిన కోర్టులో మీరు రెస్పాండెంటు అయి ఉన్నారు. కావున ఈ ప్రకటన ద్వారా మీకు తెలుపబడినది ఏమనగా పై తెలుపబడిన కోర్టు వారు మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది.17-08-2023వ తేదీన** పై **కేసులో మీకు వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు** మీరు ప్రత్యక్షంగా గాని **లేదా ప్లీడరు ద్వారా గాని వచ్చి మీకు ఏవిధమైన ఆక్షేపణలు ఉన్నా తెలుపగలరు.** లేనిచో మీకు పరోక్షంగా తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రచురించడమైనది)

వాయిదా తేదీ: 17-08-2023

జి. సునీల్ కాంత్ కుమార్
అడ్వకేట్, కాకినాడ
గుదిమెళ్ళ శ్రీ భాస్కరాచార్యులు
అడ్వకేట్, పిఠాపురం.
సెల్: 8121678123

CHANGE OF NAME

My Old Name is "SHEIK SHARIFA BEGAM". My New / Changed name is **"MOHAMMAD SHARIFA BEGAM.** Since today onwards Iam calling as **"MOHAMMAD SHARIFA BEGAM".**

MOHAMMAD SHARIFA BEGAM
D.No. 9-14-29/A,
Chanda Satram Street
Rajamahendravaram Urban
Cell: 98492 28889

పురపాలక సంఘం కార్యాలయము-పిఠాపురం

ఆర్.ఓ.సి.నెం. 118/2022-ఇ1 తేది.10-08-2023

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

పిఠాపురం పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి 3 పనులకు గాను అంచనా రూ.65.40 మరియు సాధారణ నిధుల నుండి 1 పనులకు గాను అంచనా రూ.3.30 వెరసి మొత్తం 4 పనులకు గాను రూ.68.70 లక్షలుతో ఇ-ప్రొక్యుర్‌మెంటు ద్వారా ఈ క్రింది తెలిపిన సైట్‌లలో టెండర్లు కోరబడుచున్నవి.

మిగిలిన వివరములకు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఇతర వివరముల కొరకు సెల్ నెం. 98499 06523 ద్వారా తెలుసుకొన వచ్చును.

బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ప్రారంభ తేది : 10-08-2023 సమయం ఉదయం గం॥10:00
బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ఆఖరి తేది : 17-08-2023 సమయం సాయంత్రం గం॥05:00

సం/- **కమీషనర్,** పిఠాపురం పురపాలక సంఘం